ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.90 (121.5462)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.58 (2.69)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	95.17 (0.43)	339	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



భూసమస్యల పరిష్కారంపై ఆశలు

- ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్
- రెండు వారాలుగా మండల స్థాయిల్లో ఫిర్యాదుల స్వీకరణ
- డేటా కరెక్షన్ ఫిర్యాదులే అధికం

నల్లగొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి దృష్టిసారించారు. మండల కేంద్రాల్లో సైతం 'ప్రజావాణి' నిర్వహిస్తూ ప్రధానంగా భూసమస్యల పరిష్కారానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక భూ సంబంధిత ఫి ర్యాదుల సంఖ్య పెరిగింది. ధరణిలో భూరికార్డుల నమోదు సమయంలో లోపాల కారణంగా పలు ఖాతాలు సక్రమంగా నమోదవకపోవడంతో భూయజమానులు తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో దాదాపు సగానికి పైగా భూసమస్యలే ఉంటున్నాయి. అందులోనూ ఎక్కువ భాగం మండల స్థాయిల్లో పరిష్కరించేవే అయినా, అక్కడ ఫలితం లభించక బాధితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. భూరికార్డుల డేటా ఎంట్రీలో దొర్లిన తప్పులు, లోపాలు, అక్షర దోషాలు, పొరపాట్లు భూయజమానులకు శాపంగా మారింది. దీంతో భూసమస్య ల పరిష్కారంపై కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సా రించారు. ఇప్పటికే రెండు సోమవారాలు మండల స్థాయి ప్రజావాణి నిర్వహించి అర్జీలు తీసుకోగా, అందులోనూ భూవివాదాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. ధర ణి పోర్టల్‌పై ప్రత్యేక దృష్టి సారించి, భూసమస్యకు సంబంధించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి, పరిష్కరించాలని, పరిష్కారం కుదరకపోతే స్పష్టమైన కారణాన్ని తెలియజేసి దరఖాస్తును ఎం డార్స్ చేయాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు అటు మండలాలు,ఇటు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులు 23,813 ఉండగా, అందులో 2,120 దరఖాస్తులే పరిష్కారమయ్యాయి.ఇంకా 21,693 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.వీటిలో పరిష్కారానికి వీలైన వాటిని పక్షం రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ మార్గదర్శకాలు ఇవ్వడంతో తహసీల్దార్లు ఆదిశగా పనిచేస్తున్నారు.

డేటా కరెక్షన్ సమస్యలే అత్యధికం

జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా 'ధరణి' డేటా కరెక్షన్ సమస్యలే అధికంగా ఉన్నాయి. డాటా కరెక్షన్‌కు సంబంధించి మొత్తం 16,455 దరఖాస్తులు రాగా, వాటిలో ఇప్పటివరకు 1,102 పరిష్కారమయ్యాయి. ఇంకా జిల్లాలో 15,353 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విభాగంలో అత్యధికంగా పేరు, ఇంటిపేరు, తండ్రి పేరు, సర్వే నెంబర్, బైనెంబర్ తప్పుగా నమోదవడం, కులం పేరు మారడం, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, పట్టా భూములు వేరే రకంగా నమోదవడం, ఒకరి భూమి ఇంకొకరికి పట్టా కావడం లాంటి కేసులే అధికంగా ఉన్నాయి. ధరణిలో డాటా నమోదును పూర్తిగా ఆపరేటర్లకే వదిలేయకుండా జాగ్రత్తలు వహించి ఉంటే ఈ లోపాలు ఉండేవి కావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పేటలో 7,660 పెండింగ్

జిల్లాలో 'ధరణి'కి సంబంధించి 9,681 దరఖాస్తులు వచ్చాయి. అందులో 1,021 దరఖాస్తులను అధికారులు తిరస్కరించగా, 7,660 వివిధ దశల్లో ఉన్నాయి. ఇవన్నీ తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో పౌతి, డాటా కరెక్షన్, పెండింగ్ మ్యుటేషన్, సెమీ అర్బన్, కోర్టు కేసులు దరఖాస్తులు ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధరణి పోర్టల్‌లో సమస్యలపై వచ్చిన దరఖాస్తులు ఇలా..

కేటగిరీ	దరఖాస్తులు	పరిష్కారమైనవి	పెండింగ్
ఎన్ఆర్ఐల పట్టా పుస్తకాలు	7	0	7
కోర్టు కేసు ఇంటిమేషన్	1,272	715	557
కోర్టు కేసుల పట్టా పుస్తకాలు	284	1	283
డాటా కరెక్షన్	16,455	1,102	15,353
జీపీఏ	10	5	5
ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ	1,878	1	1,877
నాలా, ఇంటి స్థలాల పాస్‌పుస్తకాలు	6	0	6
ఖాతా మెర్జింగ్	12	2	10
ల్యాండ్ మ్యాటర్స్ (గ్రీవెన్స్)	1,600	26	1,574
నాలా డబ్ల్యూవో పట్టాపుస్తకం	140	34	106
ఆర్గనైజేషన్ పీపీబీ	2	0	2
పెండింగ్ మ్యుటేషన్	1,040	64	976
సక్సెషన్	989	170	819
అర్బన్ ల్యాండ్	118	---	118
మొత్తం	23,813	2,120	21,693

కమీషన్ల కోసం కక్కుర్తి



- అబార్షన్‌లు చేయిస్తున్న ఆర్ఎంపీలు
- సహకరిస్తున్న ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు?
- ప్రైవేట్ వైద్యుల ఫీజులో 50 శాతం వసూలు?

చివ్వెంల, జూలై 4 : కమీషన్ల కోసం ఆర్ఎంపీలు దారుణాలకు ఒడిగడుతున్నారు. కుమారుడి కోసం ఆరాటపడే జంటలే లక్ష్యంగా స్కానింగ్ చేయిస్తూ, ఆడశిశువు అని తేలితే అబార్షన్‌లు చేయిస్తున్నారు. ఇందుకోసం వైద్యులను సంప్రదించి కమీషన్లు మాట్లాడుకుంటున్నారు. ఇటీవల మండలంలోని ఎంజీనగర్‌తండాకు చెందిన సుహాసినికి గర్భస్రావం చేస్తుండగా వికటించి మరణించింది. ఈ కేసులో ఆరుగురు నిందితులు అరెస్టయ్యారు. ఇందులో ఓ ఆర్ఎంపీతో పాటు నర్సు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. ఏడో నెలలో గర్భస్రావం చేయడానికి కూడా వెనుకావడం లేదు. ఇందుకు సుహాసిని ఉదంతమే ఉదాహరణ. ఈ కేసు కాక చివ్వెంల మండలంలో ఇలా అబార్షన్‌లు చాలా జరుగుతున్నట్లు సమాచారం. ఇందుకోసం కొందరు ఆర్ఎంపీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గైనకాలజిస్టుల వద్దకు కమీషన్ల కోసం ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. చివ్వెంల మండలంలో అధికంగా తండాలు ఉన్నాయి. కమీషన్‌కు కక్కుర్తిపడిన పడిన ఓ రెండో ఏఎన్ఎం చివ్వెంల సమీప గ్రామాల్లోని తండాల్లో మరో ముగ్గురు ఏఎన్ఎంలు, కొందరు ఆశావర్కర్లు ప్రైవేట్ వైద్యుల వద్దకు గర్భిణులను తీసుకెళ్తున్నారు. గ్రామాల్లో అంతో ఇంతో ఆస్తి ఉండి మొదటి రెండు సంతానంలో ఆడపిల్లలు పుట్టిన వారు మూడో సంతానంలో మగబిడ్డ కోసం గర్భం దాల్చిన వారిని లక్ష్యంగా చేసుకుని సంప్రదిస్తున్నట్లు సమాచారం. దీంతో వీరి నుంచి రూ.వేలల్లో వసూలు చేసి స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నామమాత్రంగా హెచ్చరికలు చేసి వదిలేస్తుండటంతో అబార్షన్ల తంతు కొనసాగుతోంది.

50 శాతం కమీషన్

లింగ నిర్ధారణ, గర్భస్రావం కోసం తీసుకెళ్తున్న వారి నుంచి ఆర్ఎంపీలు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు సంబంధిత వైద్యుల వద్ద ఫీజులో కమీషన్లు తీసుకుంటున్నట్లు సమాచారం. 50 శాతం కమీషన్ ఇస్తుండటంతో ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా తమ పేర్లు బయటకు రాకుండా ఆసుపత్రి రిజిస్టర్లలోనూ గర్భిణుల పేర్లు లేకుండా జాగ్రత్త తీసుకుంటున్నారు. ఆసుపత్రుల్లో ఇటీవల సుహాసిని ఉదంతంతో వీరి వ్యవహార శైలి వెలుగుచూసింది.

ప్రారంభమైన ప్రత్యేక అధికారుల పాలన

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 4 : మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో పరిపాలనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని 23 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మండలం - అధికారి(హోదా)

సూర్యాపేటరూరల్ - వేణుమాధవ్(ఆర్డీవో)
చివ్వెంల - జగదీశ్వర్‌రెడ్డి(డీఎండబ్ల్యూ)
పెన్‌పహాడ్ - రాములు(డీఎంసీఎస్)
నూతనకల్ - సుదర్శన్‌రెడ్డి(డీజీడబ్లూ)
తిరుమలగిరి - అనుసూర్య(డీబీసీడీవో)
మద్దిరాల -నాగయ్య(జిల్లాహార్టికల్చర్ అధికారి)
జాజిరెడ్డిగూడెం - శ్రీధర్‌రెడ్డి(డీఏవో)
మేళ్లచెర్వు - పద్మ(డీసీవో)
కోదాడ - సూర్యనారాయణ(ఆర్డీవో),
చిలుకూరు- రూపేందర్‌సింగ్(జిల్లా మత్స్యశాఖాధికారి)
మునగాల - శిరీష(డిప్యూటీ జడ్పీ‌ఈ సీఈవో)
చింతలపాలెం - శ్రీనివాస్‌రెడ్డి(ఏడీఎస్, ఎల్ఆర్)
నడిగూడెం - సతీష్‌కుమార్(డీఎఫ్‌వో)
తుంగతుర్తి - జగ్గునాయక్(ఏడీఏ)
ఆత్మకూర్(ఎస్)-నాగేశ్వరశర్మ(జిల్లా మార్కెట్ అధికారి)
గరిడేపల్లి - శ్యాంసుందర్‌ప్రసాద్(జిల్లా ఆడిట్ అధికారి)
హుజూర్‌నగర్ - శ్రీనివాసులు(ఆర్డీవో)
నేరేడుచర్ల - మోహన్‌బాబు(డీసీఎస్‌వో)
పాలకీడుకు - శంకర్(డీటీడీవో)
అనంతగిరి - డాక్టర్ కుమారస్వామి(డీవీఏహెచ్‌వో)
నాగారం - అశోక్(డీఈవో)
మట్టంపల్లి - సుధారాణి(ఏడీఏ)
మోతె - సీతారాం(జీఎం ఇండస్ట్రీస్)

నాగారంలో రూ.2 కోట్లతో గెస్ట్‌హౌస్

- ప్రతిపాదనలు పంపించాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నాయకులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నాగారం, జూలై 4 : నాగారం బంగ్లాలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై అత్యాధునిక హంగులతో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం జనగాం జిల్లాలో జరిగిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నల్లగొండకు వెళుతూ మార్గమధ్యలో నాగారంబంగ్లా గెస్ట్‌హౌస్ వద్ద కార్యకర్తల కోరిక మేరకు కాసేపు ఆగారు. నాగారంబంగ్లా వద్ద నిజాం కాలంలో నిర్మించిన రహదారి బంగ్లా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నడుచుకుంటూ వెళ్లి రహదారి బంగ్లాను పరిశీలించారు. తక్షణమే నూతన గెస్ట్‌హౌస్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే నాగారం మండలంలో అన్నిగ్రామాల్లో పర్యటించి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఆగస్టు 15లోపే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మంత్రి అన్నారు. నాగారంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఏడు ఎకరాల్లో ఫాంహౌస్‌ను వరద నీరు వెళ్లకుండా ఊరికి అడ్డంగా నిర్మించి గ్రామం ముంపునకు కారకుడయ్యాడని మంతి విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాశం యాధవరెడ్డి, దోసకొండ రమేష్, ఓరుగంటి సత్యనారయణ, గుంటకండ్ల ముకుందారెడ్డి, బిక్కి శ్రీను, కడారి సోమయ్య, కొంపెల్లి శ్రీనివాస్, జాజుల వీరయ్య, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, కన్నెబోయిన రాంమూర్తి, వెంకటభిక్షం, యాకస్వామి పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డయేరియాను నివారించవచ్చు



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కోటా చలం

మేళ్లచెర్వు, జూలై 4: వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో డయేరియా వ్యాప్తిని నివారించవచ్చని డీఎంహెచ్‌వో కోటా చలం అన్నారు. చింతలపాలెం మండలకేంద్రంలో గురువారం పర్యటించిన డీఎంహెచ్‌వో పలు కాలనీలు తిరిగి స్థానికులకు డయేరియా వ్యాప్తిపై అవగాహన కల్పించారు. కలుషిత ఆహారం, నీటితో వ్యాధి వ్యాప్తి చెందుతుందని, ఓఆర్ఎస్ తయారీ విధానం వ్యక్తిగత పరిశుభ్రత గురించి, స్థానికులకు వివరించారు. ఈ ప్రాంత నీటి నమునాలు సేకరించి, పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించామన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్, మెడికల్ ఆఫీసర్ నవ్య, తహసీల్థార్ సురేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఉపేంద్రకుమారి, హెల్త్‌అసిస్టెంట్ రాములు, సైదులు, విజయకుమారి, కల్యాణి, ఆశావర్కర్లు ఉన్నారు.

ఉన్నత ఉద్యోగాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న పూలమ్మ

మునగాల రూరల్, జూలై 4 : ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా వసతిని సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని, తద్వారా తల్లిదండ్రుల కలల్ని, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని జీఈసీవో పూలమ్మ అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, వసతిగృహాన్ని, ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, వసతి గృహ గదుల్ని పరిశీలించారు. భోజన వసతి, వంట రూం, డైనింగ్ హాల్, ఇతర అన్నిరకాల సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పేద, కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి సునీతారాణి, ఉపాధ్యాయులు జ్యోతి, భూలక్ష్మి, స్వాతి, విజయలక్ష్మి, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మునిసిపల్ స్థలాలు ఆక్రమిస్తే కఠినచర్యలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కోదాడ, హుజూర్‌నగర్ మునిసిపాలిటీల్లో సమీక్షలు



హుజూర్‌నగర్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్‌నగర్, జూలై 4 : అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని క్రైస్తవుల శ్మశానవాటిక పనులను పరిశీలించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో టీయూఎఫ్‌డీసీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ పట్టణంలో రూ.25 కోట్ల పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. మునిసిపల్ స్థలాలపై కోర్టుకు వెళ్లిన సంఘటనలపై కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. గతంలో మునిసిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా లేఅవుట్ స్థలాలకు నెంబర్లు కేటాయించిన సంఘటనపై విచారణ చేయాలని ఆదేశించారు. లేఅవుట్ స్థలాలను కాపాడాలన్నారు. మెయిన్‌రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. ఔటర్‌రింగ్‌రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నెంబర్లు కేటాయించవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే అధికారులను ఇంటికి పంపిస్తానన్నారు. పట్టణంలో మినీస్టేడియం, ఏటీసీ కళాశాల నిర్మాణానికి స్థలం ఎంపికకు ఆర్డీవో కమిషనర్, తహసీల్దార్, మునిసిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లతో కమిటీ వేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రెండురోజుల్లో స్థలం ఖరారు చేయాలన్నారు. సాయిబాబా థియేటర్ వద్ద 5,500 గజాల లేఅవుట్ స్థలానికి కంచె వేయాలన్నారు. ఫణిగిరి గట్టు వద్ద మోడల్ కాలనీ పనులను వేగవంతం చేయాలన్నారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. రూ.2కోట్లతో గోవిందాపురం బ్రిడ్జి నిర్మించాలన్నారు. రూ.3కోట్లతో హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలన్నారు. లింగగిరి రోడ్డు, మట్టపల్లి బైపాస్ జంక్షన్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి : కలెక్టర్

ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కోరారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో పారిశుధ్యం మెరుగుదలకు సహకారం అందించాలన్నారు. పనిచేయని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి సూచించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్‌ఛైర్మన్ సంపత్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, యరగాని నాగన్నగౌడ్, గెల్లి రవి, వీరారెడ్డి, అజీజ్‌పాషా, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, దొంతగాని శ్రీనివాస్ గౌడ్, డీఈ రమేష్, ఎన్ఎస్‌పీ ఈఈ శ్రీనివాసు, డీఈ బిక్షం, ఏఈ శ్రీనివాస్,కౌన్సిలర్లు కస్తాల శ్రావణ్, ఓరుగంటి నాగేశ్వరరావు, ఫణి, శంభయ్య, మంజుల, రామ్‌గోపి, సౌజన్య, సరిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

కోదాడను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కోదాడ: కోదాడను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి పరిచి రాష్ట్రంలో ఆదర్శంగా నిలుపుతామన్నారు. పట్టణంలోని మినీట్యాంక్‌బండ్ అభివృద్ధికి రూ.8 కోట్లు మంజూరు చేశామని, వెంటనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసే కాంట్రాక్టర్‌కి పనులు అప్పగించాలన్నారు. పట్టణంలోని సమస్యలపై కౌన్సిల్ సమావేశాల్లో చర్చ జరిపి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కోదాడలో రూ.20 కోట్ల అభివృద్ధి పనులపై సమీక్షించారు. రూ.6 కోట్లతో టౌన్‌హాల్ నిర్మాణం, రూ.50లక్షలతో ఖమ్మం ఎక్స్‌రోడ్డు జంక్షన్ అభివృద్ధి, రూ.1.1కోట్లతో ముఖద్వారాలు, రూ.4.4 కోట్లతో చెరుకుకట్ట బజార్ నుంచి అనంతగిరి రోడ్డు వరకు మేజర్ ఔట్‌పాల్ మురుగుకాల్వ నిర్మాణం, అదనపు అవుట్ సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది, కోదాడలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు, ఇంజనీర్లతో కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ రమాదేవి, ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఈఈ ప్రసాద్, కౌన్సిలర్లు, ఆర్డీవో సూర్యానారాయణ, తహసీల్దార్, ఎంపీడీవో, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ భూకబ్జాలపై న్యాయపోరాటం



కుడకుడ 126 సర్వే నెంబరు భూమి వద్ద మాట్లాడుతున్న సంకినేని వరుణ్‌రావు

చివ్వెంల, జూలై 4: మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనుచరులకు రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిని కట్టబెట్టారని,ఆయా భూకబ్జాలపై న్యాయ పోరాటం చేస్తామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని కుడకుడ రెవెన్యూ శివారు సర్వే నెంబరు 126లో బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూకబ్జాల విషయంపై త్వరలోనే కోర్టుకు వెళ్తామన్నారు. పట్టణంలో పదేళ్లుగా బీఆర్ఎస్ నాయకుల భూదందా విపరీతంగా పెరిగిందన్నారు. కలెక్టరేట్ భవనానికి ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువైన స్థలాన్ని బడా నేతలకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. స్థానిక నేతలతో పాటు అతడి బంధువులకు, నాగారం గ్రామస్థులకు కుడకుడలో పట్టా చేయడంఏంటని ప్రశ్నించారు. సర్వేనెం.126తో పాటు 817, 816, 818లలో ఉన్న ఇనాం భూములను కబ్జా చేశారని, 817లో 38 గుంటల భూమి పూర్తిగా కబ్జాకు గురైందన్నారు. అనుకూలమైన వారికి 1000 గజాలకు పైగా రిజిస్ట్రేషన్ చేశాడన్నారు. బినామీలు, ప్రభుత్వ ఉద్యోగులు, మాజీమంత్రి బంధువులకు,అనుచరులకు పట్టాలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపైన సమగ్ర విచారణ చేసి బాధ్యులపై, వీరికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అప్పటి కలెక్టర్ వెంకటరావు అక్రమార్కులకు సహకరించడం దుర్మార్గమన్నారు. ఆయన్ను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రైవేట్, అర్హతలేని వ్యక్తులకు దగ్గరుండి రిజిస్ట్రేషన్ చేసిన వెంకటరావుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, అబీద్, చల్లమల్ల నర్సింహ, ధరావత్ శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం




సూర్యాపేటలో మాట్లాడుతున్న అల్గుబెల్లి నర్సిరెడ్డి

సూర్యాపేటఅర్బన్, జూలై 4 : నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నీట్ పేపర్ లీకేజీ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం చేపట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైందన్నారు. సూర్యాపేటలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా పత్రాలు లీక్ ఘటనపై దేశవ్యాప్త ఆందోళనలు జరుగుతున్నా ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సుమారు 70 ప్రవేశా పరీక్షలు లీకయ్యాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఛైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి వెంటనే రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోకి నీట్ పరీక్షలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లూరి సింహాద్రి, గోపగాని రవి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, బొమ్మగాని వినయ్, బండి రవి, పిడమర్తి భరత్, వినోద్, బానోతు వినోద్‌కుమార్, ప్రవీణ్, లింగయ్య, లక్ష్మణ్, అన్వేష్ పాల్గొన్నారు.


పెద్దచెరువుకు జలకళ




భువనగిరి పెద్దచెరువు

చెరువు నిండితే.. ఆ ఊరి కడుపు నిండినట్టే. సమృద్ధి పంటలు, చేతివృత్తులకు చేతినిండా పని, మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి ఎందో దోహదమవుతాయి. ఇటీవల కురిసిన వర్షాలకు భువనగిరి పెద్దచెరువు జలకళను సంతరించుకుంది. చెరువు నిండా నీరు ఉండడంతో అటుగా వెళుతున్న వాహనదారులు, ప్రయాణికులు చెరువుల అందాలను తిలకిస్తూ ముందుకు సాగుతున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి


నిండు కుండలా భువనగిరి పెద్దచెరువు

నృసింహుడి జూన్ ఆదాయం రూ.23.91కోట్లు

యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కరరావు

యాదాద్రి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఖజానాకు జూన్ నెలలో మొత్తం రూ.23,91,09,020ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎ.భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాద విక్రయం ద్వారా రూ.4,85,71,780, హుండీ రూ.3,48,12,940, వీఐపీ దర్శనం రూ.1,90,95,450, ఆర్జిత సేవలు రూ.87,54,503, బ్రేక్ దర్శనం రూ.80,49,900, వ్రతమండపం రూ.36,14,200, విచారణ శాఖ రూ.38,83,183, ఇతరముల ద్వారా రూ.11,23,27,064 వరకు ఆదాయం సమకూరిందని, జూన్ 2023లో రూ.16,36,04,962 ఆదాయం సమకూరిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ సారి రూ.7,55,04,058 వరకు ఎక్కువ ఆదాయం సమకూరిందన్నారు. స్వామివారి దర్శనం కోసం విచ్చేసే భక్తుల కోసం సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గిరి ప్రదక్షిణ దారిలో సిమెంట్ ప్లేవర్స్‌టైల్స్ ఏర్పాటుచేశామని, 5వేల మందితో స్వాతినక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ ప్రారంభించినట్టుపేర్కొన్నారు. భక్తులకు రోజుకు 600నుంచి వేయిమందికి వరకు అన్నప్రసాద సౌకర్యం, వినాయక నాట్యమండలి సురభి బృందంతో నాలుగు రోజుల పాటు నాటకాలు ప్రదర్శించినట్టు తెలిపారు. స్థానికులకు ప్రతి మంగళవారం ఉదయం 8.30నుంచి 9గంటల వరకు ఉచితంగా గర్భాలయ దర్శనం, 54,213 మంది భక్తులు తలనీలాలు, 508బస్సుల ద్వారా 9,56,514 మంది భక్తులను కొండపైకి ఉచిత బస్సు రవాణా కల్పించామని పేర్కొన్నారు.

అవమాన భారంతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● వేధింపుల ఘటనతో ఇరువర్గాలపై కేసులు ● యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో ఘటన

అడ్డగూడూరు, జూలై 4: ఓ మహిళపై వేధింపుల ఘటన ఇరువర్గాలపై కేసులు నమోదుకాగా, అవమాన భారం భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన దుర్సోజు రవీంద్రాచారి అదే గ్రామానికి చెందిన సట్టు శైలజను ఏడాదిగా వెంబడిస్తూ అసభ్యకరంగా సైగలు చేస్తున్నాడని సదరు మహిళ తన భర్త సట్టు రవికి విషయం చెప్పింది. దీంతో రవితోపాటు ఆయన సోదరుడు సట్టు పరుశురాములు, మరికొంతమంది రవీంద్రాచారి ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో రవీంద్రాచారి, ఆయన భార్య అసభ్యంగా తిట్టి, శైలజ, రవిని నెట్టేశారని, ఈ విషయంపై శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉంటే తన ఇంటిపైకి వచ్చి భార్య రాజేశ్వరి, కుమారుడు శివపై దాడి చేశారని రవీంద్రాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవమాన భారంతో..

అవమాన భారంతో రవీంద్రాచారి భార్య రాజేశ్వరి ఆత్మహత్యాయత్నం చేసింది. సట్టు రవి, సట్టు పరుశురాములు పలువురితో కలిసి వచ్చి ఈ నెల 1వ తేదీన అర్ధరాత్రి రవీంద్రాచారి భార్య రాజేశ్వరి, కుమారుడు శివపై దాడి చేశారని, ఈ విషయమై 100కి ఫోన్ చేయగా పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చారని మరుసటి రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రవీంద్రాచారి భార్య రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కొంతమంది నాయకులు, పోలీసులు రాజీపడాలని బలవంతం చేసినట్లు రవీంద్రాచారి ఆరోపించారు. ఇదిలా ఉండగా ఈ నెల 3వ తేదీన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య.. దుర్సోజు రవీంద్రాచారిని సస్పెండ్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్ని అవమానాలు తట్టుకోలేక రవీంద్రాచారి భార్య రాజేశ్వరి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్సకోసం తిరుమలగిరి మండల కేంద్రానికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రజాసేవకు విరమణ లేదు


కొండమల్లేపల్లి ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

● ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ, జూలై 4: సమాజంలో ప్రభుత్వ అధికారులకు తప్ప ప్రజా ప్రతినిధులకు పదవీ విరమణ ఉండదని, నిత్యం ప్రజాసేవలోనే కొనసాగడానికే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంటుందన్నారు. తన కుమార్తె కొండమల్లేపల్లి నూతన మండలంగా ఏర్పడి మొదటి ఎంపీపీగా ప్రజల ఆదరణను పొందడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రశంసించారు. అనంతరం పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ సరస్వతమ్మ, ఎంపీడీవో రాంరెడ్డి, దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కోఆప్షన్ మెంబర్ సిరాజ్‌ఖాన్, నాయిని మాధవరెడ్డి, వేమన్‌రెడ్డి, లక్కిదాస్, కొర్ర రాం సింగ్, యుగంధర్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభం

కొండమల్లేపల్లి మండలంలోని ఎస్‌వీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కొండమల్లేపల్లి ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మంచి సహకారం అందే అవకాశం ఉందన్నారు. కొండమల్లేపల్లి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు న్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తగిన న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ప్రెసిడెంట్ విరాహత్‌అలీ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, గాదె గిరిధర్‌రావు, మాధవరెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఏరుకొండ రాము పాల్గొన్నారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో జరిగిన దేవరకొండ డివిజన్ వర్కింగ్ జర్నలిస్టు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఐజేయూ అధ్యక్షుడు విరాహత్‌అలీ మాట్లాడారు.

సీఎం అవుతావని రేవంత్‌రెడ్డికి ఆనాడే చెప్పా

● క్షమాభిక్షపై విడుదలైన ఖైదీ నాగయ్య

నిడమనూరు, జూలై 4: ప్రజల కోసం పోరాడుతున్న తపన చూసి మీరు తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని సీఎం రేవంత్‌రెడ్డికి జైలులో ఆనాడే చెప్పానని క్షమాభిక్ష ఖైదీ తరి నాగయ్య అన్నారు. భార్య మీద కోపంతో క్షణికావేశంలో కుమారుడిని కాల్వలో ముంచి చంపిన కేసులో 16 ఏళ్ల శిక్ష అనుభవించి ప్రభుత్వ క్షమాభిక్షతో జైలు నుంచి ఇటీవల విడుదలైన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం గుంటుకగూడెం గ్రామానికి చెందిన తరి నాగయ్య. విలేకరులతో జైలు అనుభవం పంచుకున్నారు. తాను తెలియక చేసిన తప్పుకు తనను నల్లగొండ జైలుకు తరలించక ముందు మొదట చర్లపల్లి జైలులో ఖైదీగా శిక్ష అనుభవించానని తెలిపారు. అక్కడ ఉన్న సమయంలోనే ఓటుకు నోటు కేసులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా చర్లపల్లి జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చారని గుర్తుచేశారు. జైలులో ఆయనకు సహాయకుడిగా పనిచేశానని, రేవంత్‌రెడ్డితో అనేక విషయాలపై మాట్లాడానని తెలిపారు. ప్రజల కోసం ఆయన ఎంతో తపన పడేవారన్నారు. ఆయన తపన చూసి కచ్చితంగా సీఎం అవుతాడని, ఆయనతో పాటు ఖైదీలకు కూడా ఆనాడే చెప్పానన్నారు. జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కోసం ఒత్తిడి తేవాల్సిందిగా అప్పట్లో ఆయన్ను అనేకసార్లు కోరానని తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తమకు బతుకుదెరువు కోసం ఉపాధి కల్పిస్తానని ఆనాడే రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే తనలాంటి అనేక మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్షకు మోక్షం లభించిందన్నారు. అనేక ఇంటర్వ్యూల్లో రేవంత్‌రెడ్డి తన పేరు ప్రస్తావించాడని గుర్తుచేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తానన్నారు. తెలియక చేసిన తప్పుకు తాను 16 ఏళ్లు జైలులో గడిపానని, శేష జీవితం కుటుంబంతో ఆనందంగా గడిపేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. సీఎం తనకు ఉపాధి కల్పించాలని నాగయ్య అన్నారు.


తరి నాగయ్య

మాటు వేసి.. వెంబడించి

● ఉపాధ్యాయురాలి ఆభరణాలతో చైన్ స్నాచర్ల పరారీ



సీసీ ఫుటేజీలో రికార్డైన అనుమానితులు

నాగార్జున సాగర్, జూలై 4: ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలు... విధులు ముగించుకుని గురువారం సాయంత్రం తన స్కూటీపై పాఠశాల నుంచి బయలుదేరారు. అప్పటికే మాటు వేసిన ఇద్దరు చైన్ స్నాచర్లు ద్విచక్ర వాహనంపై ఆమెను అనుసరించారు. సుమారు 20కిలోమీటర్ల దూరం వెంబడించి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల తాళిబొట్టు, బంగారు గొలుసు అపహరించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో ఈ సంఘటన జరిగింది. సాగర్ సీఐ భీసన్న, బాధితురాలు రూపారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీకి చెందిన మెట్ల రూపారెడ్డి పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఐదు గంటల సమయంలో తన స్కూటీపై పెద్దవూర నుంచి నాగార్జునసాగర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దవూర చౌరస్తా నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు దుండగులు ఉపాధ్యాయురాలి స్కూటీని అనుసరించి వస్తున్నారు. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీ నర్సరీ వద్ద జనసంచారం లేదని గమనించిన దుండగులు స్కూటీపైనే ఉన్న ఉపాధ్యాయురాలి మెడలోని నాలుగు తులాల తాళి బొట్టు, బంగారు గొలుసు లాక్కొని మాచర్ల వైపు పరారయ్యారు. ఉపాధ్యాయురాలు స్కూటీపై నుంచి కింద పడిపోవడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సాగర్‌లోని అన్ని కూడళ్లలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాకు 400మంది విద్యార్థులు హాజరు

నల్లగొండ, జూలై 4: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు 400మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై. ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, నాన్‌ఐటీ రంగాల్లో అవకాశాలకు బీటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్‌లతో పాటు ఇతర డిగ్రీల అర్హతతో విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 150 మందికి పైగా విద్యార్థులు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో కూడా పాల్గొన్నారన్నారు. పరీక్షలతో పాటు ఇంటర్వ్యూలతో ఆయా కంపెనీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



రాఘవేంద్రచారి(ఫైల్)

మర్రిగూడ, జూలై 4: బైక్ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని సరంపేట గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాఘవేంద్రచారి(35) రాంరెడ్డిపల్లి గ్రామంలో తన బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బుధవారం వెళ్లాడు. రాఘవేంద్రచారి అదేరోజు రాత్రి బైక్‌పై తన స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలోని మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. గురువారం ఉదయం సరంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పొలం పనుల నిమిత్తం వెళ్తుండగా దారి పక్కన పడి ఉన్న రాఘవేంద్రచారిని గుర్తించి ఆయన భార్యకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి వెళ్లి చూసింది. అప్పటికే రాఘవేంద్రచారి మృతిచెంది ఉన్నాడు. భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

45 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొండమల్లేపల్లి, జూలై 4: వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండమల్లేపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనంలో కన్పించింది. దానిని ఆపి తనిఖీ చేయగా 45బస్తాల రేషన్ బియ్యం ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

ఉద్యోగి ఆత్మహత్య



మోషయ్య(ఫైల్)

మేళ్లచెర్వు, జూలై 4: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్ కార్యాలయ ఆవరణలోనే బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ళ మోషయ్య(51) చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పది సంవత్సరాలుగా వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో కొంతకాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మోషయ్య దొండపాడు గ్రామంలోని తన తండ్రి వద్ద నివాసముంటున్నాడు. గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో పశువైద్య కేంద్రంలోని వరండాలో కొక్కానికి చీరతో ఉరి వేసుకుని ఉన్న మోషయ్యను స్థానికులు గమనించారు. వెంటనే తండ్రి వీరయ్యకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆయన మృతిచెంది ఉన్నాడు. మోషయ్య తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మోషయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూలై 4: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.19,12,316 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చెత్త కుప్పలకు నిలయంగా..

● డబుల్ బెడ్‌రూం ఇళ్ల పక్కనే చెత్త డంప్ ● 18నెలల క్రితం పేదలకు ఇళ్లు కేటాయింపు ● సౌకర్యాలు లేక అప్పగించని అధికారులు



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల స్థలాల్లో పేరుకపోయిన చెత్త కుప్పలు



బీబీనగర్, జూలై 4: అవి పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు. సౌకర్యాలు లేకపోవడంతో నివాసయోగ్యంగా లేని లబ్ధిదారులూ ఉండడం లేదు. 18నెలలు గడుస్తున్నా వాటి గురించి ఎవరూ పట్టించు కోవడం లేదు. ఇంకేముందు కొందరు ప్రబుద్ధులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని చెత్త డంపింగ్ యార్డుగా మార్చి దర్జాగా చెత్త వేస్తున్నారు. నిత్యం చెత్త కుప్పలు తగులబెడుతూ కాలుష్యాన్ని కలుషితం చేస్తున్నారు. బీబీనగర్ పట్టణ శివారులో భూదాన్‌పోచంపల్లికి వెళ్లే ప్రధాన దారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం నిర్మించారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించని అధికారులు, నివాసం ఉండడానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో ఏడాదిన్నర కాలంగా వాటిని లబ్ధిదారులకు అప్పగించలేదు. పేదల సొంతింటి కల నెరవేరకపోగా, నిరుపయోగంగా చెత్త కుప్పలకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రిలో వాడి పడేసిన వైద్య పరికరాలు, ఇతరత్ర వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి ఇక్కడే పారబోస్తుండడంతో వ్యర్థాలన్నీ గుట్టలుగా మారాయి. వాని నిప్పు పెట్టి తగులబెడుతుండడంతో దుర్వాసనతో కూడిన పొగ వస్తోంది. ఈగల మోతతో ఇక్కడి పరిసరాలను కలుషితం చేస్తున్నాయి.

సొంతింటి కల నెరవేరేది ఎప్పుడో?

బీబీనగర్- భూదాన్‌పోచంపల్లి రోడ్డు మార్గంలో సర్వే నెంబర్ 495/1లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి 2017 జూలై 24న అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి 40 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణ వ్యయం భారంగా మారడంతో కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. ప్రజల నుంచి వ్యతిరేక వస్తుండడంతో కొండమడుగులో 30 ఇళ్లు, బీబీనగర్‌లో 40 ఇళ్లకు 11 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. లబ్ధిదారుల ఎంపిక చేసేందుకు గత ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. బీబీనగర్‌లోని 11డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం 359 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 157మందిని అర్హులుగా గుర్తించారు. 2023 ఫిబ్రవరి 17వ తేదీన రిజర్వేషన్ల వారీగా లక్కీ డ్రా ద్వారా 11మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎస్సీలకు-4, ఎస్టీలకు-2, మైనార్టీకి- 1, బీసీ, ఓసీలకు-4 చొప్పున ఇళ్లు కేటాయించారు.



కుప్పలు తెప్పలుగా ఎయిమ్స్ ఆస్పత్రి వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం

నేను ఇక్కడ విధుల్లో చేరకముందే డబుల్‌బెడ్ రూం ఇళ్ల స్థలాల పక్కన చెత్త డంప్ చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఎయిమ్స్ నుంచి కూడా మెడిసిన్ రహిత కాటన్ కవర్లను ఇక్కడ పోస్తున్నట్లు తెలిసింది. ఎవరు అనుమతులు ఇచ్చారో తెలుసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివారణ చర్యలు తీసుకుంటాం. అలాగే లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అప్పగించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

● ఇంద్రసేనారెడ్డి, పంచాయతీ కార్యదర్శి బీబీనగర్

మార్కెట్‌లో రూ.10 నోటు

● వ్యాపారులకు ఇబ్బందిగా రూ.10, రూ.20 నోట్లు ● డిజిటల్ చెల్లింపులపైనే ప్రజల మొగ్గు



నోటు చూపుతున్న వినియోగదారుడు

భూదాన్‌పోచంపల్లి, జూలై 4: మార్కెట్లో చిల్లర డబ్బులు దొరక్క వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ రూ.10 నోట్ల కొరత చాలా ఉంది. మార్కెట్లో రూ.10నోట్ల చెలామణి తగ్గిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఉన్నా చిరిగిపోయినవి చలామణి అవుతున్నాయి. ప్రతి చిన్న వస్తువుకు కొనుగోలుదారుడు ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నారు. లేకుంటే రూ.500, రూ.200ల నోట్లు ఇస్తుండడంతో చిల్లర కొరత తలెత్తుతోంది. వాస్తవానికి బ్యాంకుల్లో సైతం డబ్బులు డ్రా చేసిన వారికి ఎక్కువగా రూ.100, రూ.200, రూ.500 నోట్లు ఇస్తుండగా అప్పుడప్పుడూ రూ.20 నోట్లు కూడా వస్తున్నాయి. దీంతో మార్కెట్లో రూ.10నోట్ల చలామణి తగ్గింది. కొనుగోలుదారులకు, అమ్మకందారులకు రూ.10, రూ.20 నోట్ల కొరత ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు బ్యాంకులు రూ. 10, రూ.20 నోట్ల కోసం ఇండెంట్ పెట్టినప్పుడు రూ.20 నోట్లు, రూ. 50 నోట్లు, రూ. 100 నోట్లు ఎక్కువగా వస్తున్నాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. దీంతో పది రూపాయల నోట్ల కట్టల కోసం వ్యాపారులు సైతం కావాలని తరుచూ బ్యాంకుకు వచ్చి వెళ్తున్నారని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇక డిజిటల్ సేవలు పెరిగి పోవడంతో నోట్ల చలామణి తగ్గిపోవడంతో రూ.10 నోట్లు రానున్న రోజుల్లో మహాభాగ్యమే కానుంది. మార్కెట్లో రూ.10 కాయిన్స్ ఉన్నప్పటికీ వాటిని చెలామణి చేయడం కష్టమవుతుందని, తీసుకుంటే అవి చెల్లవనే భ్రమలో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలు దారులు ఉండటంతో పది రూపాయల కాయిన్ పరిస్థితి అగమ్య గోచరంలా మారింది. దీంతో రూ. 10 నోట్లకు భలే డిమాండ్ పెరిగింది.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి : బీఎల్ఆర్



వేములపల్లిలో ఎంపీపీ అనితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూలై 4: పదవీకాలం ముగిసినా ప్రజాహిత సేవలో భాగస్వాములై ప్రజా సంక్షేమానికి కృషిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో తాజా మాజీ ఎంపీపీ పుట్టల సునీత ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన సభలో ఆయన మాట్లాడారు. పదవితో సంబంధం లేకుండా ప్రజా సేవలో నిరంతరం కృషి చేసే వారికి ఎప్పుడు గుర్తింపు లభించి తగిన పదవులు వరిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పల్లా వీరయ్యను సైతం సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పుట్టల పెదవెంకన్న, పుట్టల శ్రీనివాస్, మాజీ సర్పంచులు వల్లంపట్ల ఝాన్సీ, నాగవెల్లి మధు, రామచంద్రు, పల్లా సోమమ్మ, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, దైద గిరి, మాతంగి చంటి, హాజీ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: తమ పదవీకాలం పూర్తయిన ప్రజల్లో ఉంటామని తాజా మాజీ ఎంపీపీ పోకల శ్రీవిద్య అన్నారు. పదవీకాలం పూర్తయిన ప్రజాప్రతినిధులను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్లెంల సైదులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, ఎంపీడీవో తిరుమలస్వామి పాల్గొన్నారు.

మర్రిగూడ: పదవీకాలం ముగిసినా ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తానని మాజీ ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ అన్నారు. మండల అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



నార్కట్‌పల్లిలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, జూలై 4: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 55మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఎల్లారెడ్డిగూడెంలో రూ.20లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి, ఉచిత కరెంటు, ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేశామని, త్వరలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో కల్యాణ్, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల ముత్తయ్య, చిరుమర్తి యాదయ్య, ఉంద్ర భాగ్యమ్మ, నాయకులు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, మేకల వెంకన్న, సాగర్ల సైదులు, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, సిద్దగోని స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నోముల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నకిరేకంటి యేసుపాదం, యాస కర్ణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



సైదిరెడ్డి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్, చందంపేట, జూలై 4: విద్యుదాఘాతంతో నల్లగొండ జిల్లాలో గురువారం ఇద్దరు మృతిచెందారు. చందంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు ఉన్న విద్యుత్ కనెక్షన్ వైరు తెగి మీద పడి యువకుడు, కనగల్ మండలంలోని బాబాసాయిగూడేనికి చెందిన రైతు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. కనగల్ మండలంలోని బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన రైతు, నల్లగొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నల్లబోలు సైదిరెడ్డి(52) గురువారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. పొలంలో గాలి దుమారానికి తెగిపడిన కరెంట్ వైర్లను సరిచేస్తున్న క్రమంలో సైదిరెడ్డి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం పక్కనున్న రైతు గమనించి సైదిరెడ్డి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సైదిరెడ్డి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపారు. సైదిరెడ్డికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే సైదిరెడ్డి మృతితో బాబాసాయిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సైదిరెడ్డి మృతదేహానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీలు మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ వైరు మీదపడి యువకుడు..



అనిల్(ఫైల్)

చందంపేట మండలకేంద్రానికి చెందిన కోమళ్ళ అనిల్(22) గురువారం ఉదయం పొలంలో స్ప్రింక్లర్ పైపులు మారుస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు ఉన్న విద్యుత్ కనెక్షన్ తీగ అకస్మాత్తుగా తెగి అనిల్‌పై పడడంతో విద్యుదాఘాతంతో తీవ్రం గాయపడ్డాడు. పొలం వద్ద ఉన్న అతని సోదరుడు గమనించి వెంటనే అతనిని దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనగల్ మండలంలోని బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన రైతు నల్లబోలు సైదిరెడ్డి(51) గాలి దుమారానికి బోరు మోటర్ వద్ద తెగిపడిన కరెంట్ తీగలను గురువారం ఉదయం సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన నల్లగొండ వ్యవసాయ కమిటీ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. సైదిరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బావిలో పడి కాడెద్దు మృతి

చండూరు రూరల్, జూలై 4: పత్తిచేనులో అరకదున్నుతుండగా కాలుజారి బావిలో పడి కాడెద్దు మృతిచెందింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కటుకూరి వెంకన్న తనకున్న వ్యవసాయ భూమిలో పత్తిచేను సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం పత్తిచేనులో గుంటుక కొట్టడానికై మునుగోడు మండలం సానబండ గ్రామానికి చెందిన తన స్నేహితుడు చిలుముల లింగస్వామి దగ్గర బదులుగా అతని కాడెడ్లను తీసుకెళ్లాడు. బొడంగిపర్తి గ్రామంలోని తన వ్యవసాయ భూమిలో గుంటుక కొడుతుండగా పక్కనే ఉన్న బావిని గమనించకుండ కాడెద్దు కాలుజారి బావిలో పడిపోయింది. దానితో పాటుగా జతగా ఉన్న మరోకాడెద్దు, నాగలితో సహా బావిలో పడిపోవడంతో ఒక కాడెద్దు మృతిచెందింది. మరో ఎద్దు గాయపడింది. రైతు గ్రామస్థుల సహకారంతో, ట్రాక్టర్ల ద్వారా రెండు ఎడ్లను బయటకు తీశారు. ఎద్దు కలేబరాన్ని గ్రామంలో ఖననం చేశారు. గాయపడిన ఎద్దుకు చికిత్స చేయించి సానబండకు తీసుకెళ్లారు. జత ఎద్దు తనతో లేకపోవడంతో కాడెద్దుకు బాటజరగక దిక్కులు చూస్తుండటంతో గ్రామస్థులు కన్నీరు పెట్టారు.

ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ

● నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మేళ్లచెర్వులో మంత్రి ఉత్తమ్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

పాలకవీడు, జూలై 4: తెలంగాణలో ఆగస్టు 15వ తేదీ లోపు ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చేస్తామని, ఇది దేశ చరిత్రలోనే కాంగ్రెస్ ప్రభుత్వ రికార్డని నీటిపారుదల, పౌరసరఫరా శాఖామంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడులో రూ.24కోట్లతో నిర్మించనున్న తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, మండలంలో వివిధ గ్రామాల్లోని లింక్‌రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేసితీరుతుందన్నారు. మండలానికి ఆరు నెలల్లో రూ.250 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించానని తెలిపారు. త్వరలోనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బుజ్జి మోతీలాల్, సుబ్బారావు, గోపాల్, జితెందర్‌రెడ్డి, నాగిరెడ్డి, నీమానాయక్ పాల్గొన్నారు.

సారూ.. మా సమస్యలు పరిష్కరించాలి

కోదాడ: చాలీ, చాలని వేతనాలతో అనేక ఏళ్లుగా దుర్భర జీవితం గడుపుతున్న తమను ఆదుకోవాలని కోదాడ మున్సిపల్ కార్మికులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని పర్మినెంట్ కార్మికులతో పాట తమను కూడా పర్మినెంట్ చేసి వేతనాలు ఇవ్వాలని కోరారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము నాగేశ్వరరావు, కుడుముల గోపి, యలమర్తి వెంకటేశ్వర్లు, మాతంగి నాగమణి, కుడుముల ధనమ్మ, బ్రహ్మం, మంగమ్మ నాగరాజు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మించాలి : మంత్రి ఉత్తమ్

మేళ్లచెర్వు: ఆలయంలో నూతనంగా నిర్మించే రాజగోపురాన్ని శివనామస్మరణ చేస్తూ, నిర్మించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం పర్యటించిన మంత్రి కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇష్టకామేశ్వరి సమేత స్వయంబు శంభులింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రూ.55 లక్షల వ్యయంతో ఆలయానికి దక్షిణం వైపున ఐదు అంతస్థులతో నూతనంగా నిర్మించే రాజగోపురానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనా సెక్యూలరీ పార్టీ అని ఒకేరోజు హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. అనంతరం మండల కేంద్రంలో మక్కా మసీదు సమీపంలో రూ.1.50 కోట్లతో షాదీఖానాకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఆర్అండ్‌బి ఈఈ భాస్కర్, దేవాలయ శాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, ఎంఆర్‌ఓ జ్యోతి, ఎంపీడీవో అజ్గర్ అలీ, మాజీ ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు, జడ్పీటీసీ పద్మ గోవిందరెడ్డి, ఆలయ ఈవో కొండారెడ్డి, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి, కాపుగల్లు భాస్కర్‌రెడ్డి, మునావర్ పోశం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అనంతగిరి మండల అభివృద్ధికి కృషి : మంత్రి ఉత్తమ్

అనంతగిరి/కోదాడ: అనంతగిరి మండలాభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అనంతగిరి మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ భవనాలకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా మండలాలను ఏర్పాటు చేసింది కానీ వాటి బాగోగులు పట్టించుకోలేదన్నారు. ఎక్కడా కూడా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవన్నారు. కొత్త మండలాలు ఏర్పాటు చేసి అధికారులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త మండలాల్లోని సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో పాటుగా మండలంలో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరుస్తున్నామని, సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అనంతగిరిని మండల కేంద్రంగా చేశారని, అప్పటి ఎమ్మెల్యే అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కొణతం ఉమా, కాంగ్రెస్ నాయకులు క్రిష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, డేగ కొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్, ఏఎస్పీ నాగేశ్వరరావు, తహశీల్దార్ రవికుమార్, వేనేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు మంజూరుకు కృషిచేస్తా

అల్వాలపురం, తమ్మర, బండపాలెం గ్రామస్థులకు కోదాడ-ఖమ్మం బైపాస్ రోడ్డు పక్క నుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్ అల్వాలపురం గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ విషయంపై సంబంధిత అధికారులకు లేఖ రాశానని తెలిపారు. అల్వాలపురం వచ్చిన మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకురావడంతో సర్వీస్ రోడ్డు త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్లు సామినేని నరేష్, రమేష్, కనగాల రాధాకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

'నీట్' పరీక్షను తిరిగి నిర్వహించాలి

● విద్యార్థి సంఘాల నాయకులు ● జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం

నేరేడుచర్ల, జూలై 5: 'నీట్ ప్రశ్నపత్నం లీకేజీకి నిరసనగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎస్‌యూఐ, డీవైఎఫ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది.కార్యక్రమంలో నాయకులు చిలకరాజు శ్రీను, ఎడ్ల సైదులు, ఇస్తియాక్, మచ్చరవి, సుబ్బు, సతీష్, సాత్విక, వేదాంత్, జయంత్, నందన్, ధృతి, నరేష్, భరత్ పాల్గొన్నారు. మఠంపల్లి: 'నీట్ ఉదంతంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు చందర్‌రావునాయక్ అన్నారు. 'నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ మండలంలోని విద్యాసంస్థల బంద్ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, నిఖిల్, సతీష్, ఉదయ్, కుమార్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: 'నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అయినందున పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు ఉదయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరుతూ గురువారం మండలంలోని వెలిదండ గ్రామంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేసి ఆయన మాట్లాడారు. 'కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కామళ్ల సుందరయ్య, నరేష్, శ్రీను, అచ్యుత్, సిద్ధు, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: 'నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని పీవైఎల్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చేపూరి కొండలు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి వేణు మాట్లాడారు.

చిలుకూరు: కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ విద్యాసంస్థల బంద్ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు, చందు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోతె: 'నీట్ స్కామ్‌పై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పీడీ ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విప్లవ్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దోసపాటి చిరంజీవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: 'నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని తెలంగాణ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండా రాజు కోరారు. విద్యార్థి సంఘాల బంద్ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ ఎండీ అబ్దుల్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే మస్తాన్, బొంకూరి రంజిత్, అశోక్, ఆడెపు ప్రసాద్, షేక్ పాషా, సైదులు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్‌లో నాయకులు ఉప్పుల మురళి, మణికుమార్, అశోక్, ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో బంద్‌లో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

తిరుమలగిరి: 'నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. తిరుమలగిరిలో విద్యార్థులతో కలిసి విద్యాసంస్థల బంద్‌లో పాల్గొని పాల్గొన్నారు. 'నీట్ ప్రశ్నపత్రాన్ని లీకేజీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జక్కుల సుధాకర్, శ్రీధర్, పవన్, అఖిల్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): 'నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య డిమాండ్ చేశారు. మండలంలో విద్యాసంస్థల బంద్ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.


ఆత్మకూర్(ఎస్) మండలంలో ఏపూర్‌లో బంద్ నిర్వహిస్తున్న నేతలు


కోదాడలో విద్యాసంస్థను మూసివేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


నేరేడుచర్లలో బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మునిసిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేస్తా


తిరుమలగిరిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

తిరుమలగిరి, జూలై 4: తిరుమలగిరి మునిసిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం తిరుమలగిరిలోని మూడో వార్డు సుందరయ్య కాలనీలో రూ.కోటి వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, ప్రియలత, సరిత, శ్రీలత, సుంకరి జనార్దన్, పేరాల వీరేష్, రాముగౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ కళావేదిక మహిళా అధ్యక్షురాలిగా సంతోష

సూర్యాపేట టౌన్, జూలై 4: తెలంగాణ కళావేదిక మహిళా జిల్లా అధ్యక్షురాలిగా ములకలపల్లి సంతోష ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు సంతోషను జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఆత్మకూర్(ఎస్) మండలం నశింపేట గ్రామానికి చెందిన ములకలపల్లి సంతోష 17 సంవత్సరాల పాటు మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి: టీజేఎస్

చివ్వెంల, జూలై 4: మండలంలోని కుడకుడ ప్రాంతంలో సర్వే నెం. 126లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని తెలంగాణ జనసమితి మండల అధ్యక్షుడు ధరావత్ సుమన్‌నాయక్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణయ్యకు గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు జీవో నెం. 58, 59 పేరిట కొంతమంది అధికారులను పక్క తోవ పట్టించి రెగ్యులర్ చేయించుకున్నారని, ఆ భూమిని కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కబ్జా చేసిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, పేదలకు పంచాలన్నారు. కార్యక్రమంలో మల్సూర్‌నాయక్, వినయ్‌గౌడ్, యాకుబ్, సతీష్ పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్ సెక్షన్‌ను రద్దు చేయాలి'

సూర్యాపేట అర్బన్, జూలై 4: కేంద్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన హిట్ అండ్ రన్ సెక్షన్ 106(1)ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటరులో ఆటోడ్రైవర్లు, కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రోడ్ల విస్తరణ సరిగా లేదన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం జరిమానాలు విధించడం దారుణమన్నారు. వస్తువు, ప్రజా రవాణ వ్యవస్థలో లారీ, ఆటో, బస్సు, గూడ్స్, ట్రాక్టర్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సట్టు యాదగిరి, శేఖర్, రవి, వీరాచారి, మస్తాన్, ఉపేందర్ పాల్గొన్నారు.

'మృతుడి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి'

ఆత్మకూర్(ఎస్), జూలై 4: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అనుమానాస్పదంగా మృతి చెందిన శ్యామ్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ జిల్లా బృందం ఆధ్వర్యంలో ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. 80మంది ఉన్న హాస్టల్‌లో సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని తెలి పారు. హాస్టల్ ఆవరణలో, ప్రహరీ వెలుపల, హాస్టల్ బాత్‌రూమ్‌ల పక్కన పిచ్చి మొక్కలు పెరిగాయన్నారు. హాస్టల్‌ను కలెక్టర్ పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు యాతకుల ప్రవీణ్, రవీందర్, తాళ్లపల్లి మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మండల విద్యార్థుల ఎంపిక

మఠంపల్లి, జూలై 4: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల ఏడో తేదీన జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మండల కేంద్రంలోని మాన్‌ఫోర్ట్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన పాఠశాలల స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర అండర్-10 విభాగంలో నిర్వహించిన లాంగ్‌జంప్‌లో ప్రవీణ్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచాడు. బాలికల అండర్-12 విభాగంలో నిర్వహించిన లాంగ్‌జంప్‌లో అన్విత ప్రథమ స్థానం సాధించింది. ఈ ఇరువురికి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రవీణ్‌కుమార్


అన్విత

నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలి

తిరుమలగిరి, జూలై 4: ఎరువుల దుకాణాల యజమానులు నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం తిరుమలగిరిలో పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. డీలర్లు ప్రతిరోజు స్టాక్ బోర్డు పెట్టాలన్నారు. పంటల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆధార్‌కార్డు అనుసంధానంతోనే రైతులకు ఎరువులకు విక్రయించాలన్నారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

మూడు రోజుల వ్యవధిలో ఆరు మోటార్ల చోరీ

● వరుస ఘటనలతో భయాందోళనలో రైతులు

మఠంపల్లి, జూలై 4: వరుస దొంగతనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో మండలంలోని కాల్వపల్లితండా, కొత్తదొనబండతండా, అల్లీపురం, యాతవాకిళ్ల, రఘునాథపాలెం గ్రామాల్లో ఆరుగురు రైతులు బానోతు శ్రీను, పాండు, భూక్య కోటు నాయక్, భోగాల సంజీవ్‌రెడ్డి, బేత శ్రీనివాస్‌రెడ్డి, భూక్య సేవరికి చెందిన వ్యవసాయ మోటార్లను దొంగలు ధ్వంసం చేసి వాటిలో ఉన్న రాగి తీగ, ఇతర సామగ్రిని చోరీ చేశారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేసి చోరీలను నివారించాలని, చోరీ చేసి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరారు.

పేదల అభ్యున్నతికి వంగవీటి రంగా కృషి


రంగా జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

కోదాడ టౌన్, జూలై 4: పేదల అభ్యున్నతికి కృషి చేసిన వంగవీటి మోహనరంగా ఆశయాలను సాధించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నూనె సులోచన, పట్టణ అధ్యక్షుడు సన్నీరు మురళి అన్నారు. రంగా 77వ జయంతి సందర్భంగా గురువారం కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డు చౌరస్తాలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కాపుల ఐక్యత కోసం రంగా చేసిన సేవలు చిరస్మరణీమని అన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల కోటయ్య, కంబాల ప్రసాద్, హనుమంతరావు, కృష్ణవేణి, చాప గోవిందు, ఆవుల గోపి, బుజ్జిశెట్టి విజయభాస్కర్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని గాంధీపార్క్ సెంటర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జాతీయ నేత వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రవి, శేఖర్, బాబు, వెంకయ్య, గోపి, మోహన్‌రావు, రామారావు, దీపక్, రవి పాల్గొన్నారు.

కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం


తుంగతుర్తిలో కొమురయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, జూలై 4: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని మండలంలోని రావులపల్లి గ్రామంలో భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నన్నబోయిన సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.కార్యక్రమంలో దొంగరి గోవర్ధన్, వెంకన్న, శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు.జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బూర వెంకటేశ్వర్లు, గోపగాని రవి, బూర సైదులు, పల్సరాజు పాల్గొన్నారు.

● సీపీఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, దేశోజు మధు, రవి, పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహం ఎదుట సూర్యాపేట పూర్వ మిత్ర మండలి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్లకుంట్ల అయోధ్య, బయ్య మల్లికార్జున్, నల్లపాటి అప్పారావు, మాదంశెట్టి వీరయ్య, తన్నీరు యాదగిరి, సట్టు వెంకన్న, రామచందర్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో నిర్వహించిన కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో కంచర్ల నర్సక్క, సుమంత్, లింగయ్యపాల్గొన్నారు.

పెన్‌పహాడ్: దొడ్డి కొమురయ్య స్ఫూర్తి ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రణపంగి కృష్ణ, వీరబోయిన రవి, గుంజా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: దొడ్డి కొమరయ్య ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలోకొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో యోనా, మురళి, విజయ్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రంలో నిర్వహించిన కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో వట్టెపు సైదులు, గుండు సైదులు, వెంకటేశ్వర్లు, రాములు, పాల్గొన్నారు.

కోదాడ రూరల్: దొడ్డి కొమరయ్య ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కొమరయ్య చిత్రపటానికి డాక్టర్ సూర్యనారాయణ, ఎన్.పాపాచారి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భీమయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి: కొమురయ్య వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ, ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రం నుంచి జూనియర్ కాలేజ్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో గోకినపల్లి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి శివకుమార్ కొత్తపల్లి రేణుక, లక్ష్మన్న, బాణాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి: మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో వజ్జె శ్రీనివాస్, బయ్యా లింగయ్య, జక్కుల సుధాకర్, మండాడి శ్రీధర్, దడిపెల్లి వెంకట్, డి.పవన్, లింగయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో సీపీఎం కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కందాళ శంకర్‌రెడ్డి, తొట్ల లింగయ్య, బొజ్జ విజయ్, సామ సురేందర్‌రెడ్డి, బాణాల విజయ్‌రెడ్డి, గజ్జల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పదవులు లేకున్నా ప్రజాసేవ చేయాలి


తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధుల పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సామేలు

తిరుమలగిరి, జూలై 4: పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజాసేవ చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని, ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై పోరాడితేనే ప్రజలు జీవితాంతం గుర్తించుకుంటారని అన్నారు. నాయకులు ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత, జడ్పీటీసీ దూపటి అంజలి, మునిసిపల్ చైర్మన్ శాగంటి అనసూయ, ఎంపీటీసీలు జుమ్మీలాల్, సమత, నాయకుడు సుంకరి జనార్దన్, ఎంపీడీవో లాజర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్: పదవి ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని సూర్యాపేట జడ్పీటీసీ జీడిభిక్షం అన్నారు. సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామంలో హరితహారం మొక్కలకు గుంతలు తీసే కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. జడ్పీటీసీ పదవీ కాలం ముగియడంతో 'ఉపాధి' హామీ కూలీలు మొక్కను బహుకరించి సన్మానించి వీడ్కోలు పలికారు.


హుజూర్‌నగర్‌లో ఎంపీపీ శ్రీనివాసును సన్మానిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అర్చనరవి

హుజూర్‌నగర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గూడెపు శ్రీనివాసును మున్సిపల్ పాలకవర్గం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, యరగాని నాగన్నగౌడ్, గల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు నాగేశ్వరరావు, భాస్కర్, మంజుల, సరిత, మంగమ్మ, సౌజన్య, శ్రీను, రామ్‌గోపి, శ్రావణ్, విజయ్, ఫణికుమారి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేశామని ఎంపీపీ కొత్తమద్ది వెంకటరెడ్డి అన్నారు. చింతలపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, గోపాల్, జితేందర్ రెడ్డి, నాగిరెడ్డి, మధునాయక్, జ్యోతి పాల్గొన్నారు

మునగాల రూరల్: ఐదేళ్ల పదవీ కాలంలో ఎంతో సంతృప్తిగా పనిచేశానని మాజీ ఎంపీపీ ఎలక బిందు నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దేశిరెడ్డి జ్యోతి, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చి పాపయ్య తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ పాల్గొన్నారు.

అర్వపల్లి: రాజకీయాలకు అతీతంగా ఐదేళ్లలో మండలాన్ని అభివృద్ధి చేశామని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పదవీ కాలం ముగిసినందున జాజిరెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సందీప్‌కుమార్, ఎంపీటీసీలు నర్సింగ నాగమ్మశ్రీనివాస్‌గౌడ్, బిక్కునాయక్, భద్రమ్మ పాల్గొన్నారు.

మద్దిరాల: ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందని తహసీల్దార్ అమీన్ సింగ్, తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ మధునాయుడు అన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం పూర్తయినందున మద్దిరాల మండల కేంద్రంలో నిర్వహించిన సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జడ్పీటీసీ కన్న సురాంబవీరన్న, వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ముక్కాల అవిలమల్లు, నాగెల్లి శ్రీలత శ్రవణ్‌కుమార్, ఏలేటి ఉమమల్లారెడ్డి, మార్త అనిత కృష్ణమూర్తి, సూరారపు అవిలయ్య, పద్మవీరన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.


అర్వపల్లిలో ఎంపీపీ, జడ్పీటీసీని సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మం క్రాస్ రోడ్డుకు ఎన్టీఆర్ చౌరస్తాగా పేరు పెట్టాలి

కోదాడ టౌన్, జూలై 4: పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డుకు ఎన్టీఆర్ చౌరస్తాగా నామకరణం చేయాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో అభివృద్ధి పనుల సమీక్షా సమావేశానికి హాజరైన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఖమ్మం క్రాస్ రోడ్డులో రింగ్ రోడ్డు విస్తరణకు రూ.50లక్షలు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుళ్లపల్లి సురేష్, ఉప్పగండ్ల సరోజ, కోదాటి గురవయ్య, షేక్ బాబా షర్ఫుద్దీన్, పెదనాటి నరసింహారావు, సహదేవ్, తాళ్లూరి సూరిబాబు, జనార్దన్‌రెడ్డి, ముంద్ర రామారావు, సుబ్బారావు, హన్మంతరావు, రామారావు పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్: రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న పిన్నాని మల్లికార్జున్ ఎస్‌పీడీసీఎల్ కార్యనిర్వాహక అధ్య క్షుడిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘ కేంద్ర సీఈసీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

సూర్యాపేట రూరల్: జిల్లా సామిల్లు అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు తౌడోజు సతేంద్రచారి మాతృమూర్తి కనకమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహంపై మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బూర బాలసైదులు, షేక్ రఫీ, పాల్గొన్నారు.

చివ్వెంల: మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలోని శ్రీఉమామహేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామికి అర్చకుడు శివశర్మ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని అన్నారంబ్రిడ్జి ఎస్‌బీఐ మేనేజర్ పతంజలి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోదాడ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ నుంచి బదిలీపై పతంజలి వచ్చారు. అన్నారంబ్రిడ్జి బ్రాంచ్‌లో బ్రాంచ్ మూడేళ్లుగా మేనేజర్‌గా పనిచేసిన అనిల్‌చంద్ర సూర్యాపేటకు బదిలీ అయ్యారు. అనిల్‌చంద్రనురవి, సిరపాల్, నాగరాజుసన్మానించారు.

హుజూర్‌నగర్: మండలంలోని లింగగిరి నుంచి నుండి యాతవాకిళ్ల వరకు రూ.20కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలని జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. మండలంలోని లింగగిరిలో రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు.. రూ.60 లక్షలతో నిర్మిస్తున్న శ్రీనివాసపురం వంతెనను వెంటనే పూర్తిచేయాలన్నారు. అమరవరం, అంజలిపురం, కొత్తతండా మీదుగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో లింగారెడ్డి పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: నిరంతర విద్యుత్ సరఫరా జరగడంలేదని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు అన్నారు. మండలలోని కొమరబండ రెవెన్యూ పరిధిలో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం వరకు కరెంట్ లేదని చెప్పారు. దీంతో పురుగు మందును పిచికారీ చేయాలంటే నీరు లేక రైతులు ఇబ్బంది పడినట్లు తెలిపారు.

నూతన్‌కల్: హైదరాబాద్‌లో ఈ నెల ఏడో తేదీన నిర్వహించే దండోర రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏర్పుల నరేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలో రజతోత్సవ సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరికంటి అంబేద్కర్, పడిదల రవికుమార్, కనుకు జానయ్య, వెంకటయ్య, రమణ పాల్గొన్నారు.

నూతన్‌కల్: స్వామి వివేకానంద ప్రపంచానికే ఆదర్శనీయుడని నాగార్జున ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్ అన్నారు. స్వామి వివేకనంద వర్ధంతి సందర్భంగా పాఠశాలలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: తన పొలంలో నారుమడి ఎండిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు వల్లపు లింగయ్య కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10ఎకరాల్లో నాటు పెట్టడానికి 12బస్తాల వరి విత్తనాలను జూన్ 16వ తేదీన నారు పోశానన్నారు. నాట్లు వేయడానికి నారు సిద్ధంగా ఉండగా, . పక్కనే ఉన్న రైతు శ్రీకాంత్ భూమిలో ఉన్న వరాలకు గడ్డి మందును రాంపాక ఉప్పలయ్య, కసనబోయిన మురళి గడ్డి మందును ఈనెల ఒకటో తేదీ కొట్టారన్నారు. దీంతో ఈ నెల మూడో తేదీన తన నారుమడి ఎండిపోయిందన్నారు. ఈ మేరకు తహసీల్దార్, వ్యవసాయాధికారితో పాటు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని, తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.